క్లుప్తంగా

రైల్వే స్టేషన్లలో తనిఖీలు



పార్శిల్స్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు టౌన్: రైల్వే స్టేషన్లల్లో గంజాయి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాలకు సోమవారం జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారం, రైళ్లలో తనిఖీ చేశామని ఏఎస్సై సైమన్ తెలిపారు. అనుమానాస్పద పార్శిల్స్ తనిఖీ చేసిన తరువాతే ఆటోల్లో తీసుకెళ్లాలని ఆటో యూనియన్ నాయకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో రైల్వే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో మెట్ట గ్రామాల్లో తొమ్మిది గ్రామాలకు మధ్యన ఉన్న రామారావుగూడెం గ్రామంలో మినీ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని 9 గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. రామారావుగూడెం, మేధినరావుపాలెం, పెరుగ్గూడెం, చల్లచింతలపూడి, శ్రీరామవరం, ఇంద్రికనర్సింహపురం, కొత్తగూడెం, ఇతర గ్రామాల్లో ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే అటు భీమడోలు, ఇటు ఏలూరు 25 కిలోమీటర్ల నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి జరిగే ప్రమాదం జరిగిపోతుందని, లక్షల్లో ఆస్తి నష్టం సంభవిస్తుందన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఆయా గ్రామాలకు సౌకర్యంగా ఉండేలా ప్రమాదాలు నివారించేలా రామారావుగూడెంలో మినీ ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చల్లచింతలపూడిలో జబర్దస్త్ బృందం సందడి



చల్లచింతలపూడిలో జబర్దస్త్ టీం ప్రదర్శన

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలో మేదాదక్షిణామూర్తి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం జబర్దస్త్ టీం అప్పారావు, వినోద్, మోహన్‌లు సందడి చేశారు. ప్రేక్షకులను స్కిట్స్ చేసి నవ్వించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ చిన్నకాశీగా పేరుగాంచిన మేదాదక్షిణామూర్తి శివాలయానికి తాము రావడం, స్వామివారికి పూజలు చేయడం, మీ ఆధారాభిమానాలు పొందడంఎన్నటికి మరువలేమన్నారు. ఇంతటి అవకాశం కల్పించిన ఆలయ ఉత్సవ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగనన్న కాలనీల్లో సందడి



పోణంగి జగనన్న కాలనీలో శ్లాబు పూర్తయిన ఇళ్లు



కొమడవోలు జగనన్నకాలనీలో నిర్మించిన బేస్‌మెంట్లు

ఏలూరు రూరల్: జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి ఇంటికీ సిమెంట్‌తో పోసిన రెండు తలుపులు, రెండు కిటికీలు అమర్చుతున్నారు. ఏలూరు నియోజకవర్గంలో లక్ష్మీపురం, పోణంగి, కొమడవోలు జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు అధికారులు పర్యవేక్షణలో చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈ కాలనీల్లో

వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణ పనులు

మొత్తం 30 వేల మందికి ఇళ్లు మంజూరుకాగా, ఐదు వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో సగం నిర్మాణాలు బేస్‌మెంట్ వరకు పూర్తయింది. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వ సహకారం రూ.1.80 లక్షల మొత్తాన్ని ఇంటి ప్లాన్ మార్కింగ్, ఫౌండేషన్, గోడల నిర్మాణం, శ్లాబ్ పూర్తి చేసిన అనంతరం నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేస్తోంది. మరోపక్క ఉపాధి హామీ పథకంలో ఇంటి నిర్మాణ సమయంలో ఒక్కొక్క లబ్ధిదారుడికీ 90 రోజుల పని దినాల వేతనం అంటే రూ.23,130 లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో ఖాతాల్లో జమ చేస్తున్నారు.

పైసా ఖర్చు లేకుండా నిర్మాణం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన స్థలంలో పేదలు ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఒక్కపైసా కూడా చెల్లించకుండా ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక చొరవతో ఇప్పటికే ఇళ్ల స్థలాలు మెరక చేశారు. రోడ్లు వేశారు. నీటి వసతి కల్పించారు. ఈ నేపథ్యంలో పేదలు సంతోషంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు.

– తంగెళ్ల రాము, కార్పొరేటర్

సంతోషంగా ఉంది



సొంతిటి నిర్మాణం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా నా కుటుంబానికి నీడ దొరికింది. ఇల్లు కట్టుకోడానికి సిమెంట్, ఐరన్, ఇసుక ఉచితంగా ఇస్తున్నారు. ముందుగా కాంట్రాక్టర్‌తో ఒక అంగీకారం చేసుకుని నిర్మాణం చేపట్టాం. నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి.

– షేక్ సలీమా, లక్ష్మీపురం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట హర్షణీయం

ఏలూరు (టూటౌన్): స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీసీలకు పెద్దపీట వేయడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 18 ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు 11 సీట్లు కేటాయించిన సీఎం వైఎస్ జగన్ మరోసారి బీసీల పక్షపాతిగా నిరూపించుకున్నారని వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలోని బీసీలకు అధిక ప్రాముఖ్యత ఇస్తూ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాజాగా ఎమ్మెల్సీ స్థానాల్లోను బీసీలకు అగ్ర తాంబూలం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో బీసీలంతా సీఎం జగనన్న వెంటే నడుస్తామని చెప్పారు. బీసీలంతా సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు

స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే కోటాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో మరోసారి సామాజిక న్యాయానికి పెద్దపీట వేసి తన సత్తా చాటుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ డీవీ రామాంజనేయులు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 18 ఎమ్మెల్సీ స్థానాల్లో ఎస్సీలకు 2, ఎస్టీ 1, బీసీలకు 11, ఓసీ 4 కేటాయించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ స్థానాల్లో అందరికీ సామాజిక న్యాయం చేసిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బడుగులకు పెద్ద పీట

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశారని జాతీయ ఎస్సీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిమేర హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అన్ని వర్గాలను బేరీజు వేసి సామాజిక న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు.

భగవద్గీత పారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు, స్వామి వారికి నిత్య హోమం, నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం స్థానిక నందత్తనాథ క్షేత్రం భగవద్గీత పారయణ బృందం ఆధ్వర్యంలో భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ చేశారు. రాత్రి మచిలీపట్నానికి చెందిన మడమల రాంబాబు భాగవతార్ భక్త మార్కండేయ అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు.

వారిని అనర్హులుగా ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ సంస్థల స్పాట్ బిల్లింగ్ టెండర్లలో కంపెనీ నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్లను అనర్హులుగా ప్రకటించాలని ఏపీ విద్యుత్ మీటర రీడర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేఎస్ మల్లేశ్వరరావు అధ్యక్షతన సోమవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని పలు సబ్ డివిజన్లలో స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని, సంస్థలు నిర్ధేశించిన రేట్లు ఇవ్వకుండా దోచుకుంటున్నారని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారని తెలిపారు. మీటర్ రీడింగుల్ని 11 రోజుల్లోనే పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలు ఇవ్వడం అన్యాయమని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.శ్రీనివాసరావు, జి.దుర్గారావు, జాకబ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై మండల స్థాయి సమీక్ష



మండల స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య

దెందులూరు: స్పందన కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అంశమని, స్పందనలో నమోదైన ప్రతి ఫిర్యాదుపై అన్ని ప్రభుత్వ శాఖాధికారులు చిత్తశుద్ధి, అంకితభావంతో సమస్య పరిష్కారానికి జవాబుదారీగా విధులు నిర్వహించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్పందన మండల కమిటీతో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 40 వివిధ అంశాలపై ఫిర్యాదులు నమోదయ్యాయని, 90 శాతం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కారం చేయడం జరిగిందన్నారు. మండలంలో అధికంగా జిల్లా కలెక్టర్ స్పందన నుంచి తమకు వచ్చేవి అధికంగా ఉంటాయన్నారు. అనంతరం విద్య, వైద్యం, పంచాయితీరాజ్, గృహనిర్మాణం, డ్వాక్రా, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ శాఖల వారీగా స్పందన ఫిర్యాదులు తీసుకున్న చర్యలు ఉద్యోగుల జవాబుదారితనంపై మండల కమిటీ సమీక్షించింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్ర, ఎంఈఓ సీహెచ్ బుద్ధా వ్యాస్, పీఆర్ఏఈ చౌదరి, ఏపీఎం వేణుగోపాల్, ఏపీఓ దశరదరాంజీ, ఇతర శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షులు పోకల రాంబాబు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం



కొవ్వలిలో రోడ్డు పక్కన దర్శనమిస్తున్న టీడీపీ జెండా

దెందులూరు: జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కొవ్వలిలో మాత్రం టీడీపీ జెండాను తొలగించకపోవడం గమనార్హం. ఈ రోడ్డుపై 8 గ్రామాల ప్రజలు ప్రతి రోజూ రాకపోకలు కొనసాగిస్తారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పార్టీ జెండా పక్కన నుంచే వెళుతూ, వస్తూ ఉన్నప్పటికీ జెండాను తొలగించకపోవడంపై సర్వత్రా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు వెంటనే పార్టీని జెండాను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'మానవత – నైతికత'కు విశేష స్పందన



మానవత - నైతికత అంశంపై ముద్రించిన కరపత్రం చూపుతున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మానవత - నైతికత ఉద్యమానికి ప్రజలు, ప్రముఖుల నుంచి విశేష స్పందన, మద్దతు లభించిందని ఆ సంస్థ ఏలూరు అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, వెంకటాపురం అధ్యక్షుడు ఎండీ రెహమాన్ షరీఫ్ పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ఉద్యమంలో భాగంగా నగరంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను సోమవారం వారు పత్రికలకు వెల్లడించారు. నగర ప్రజలను కలిసి మానవత్వంతో నైతికతతో ప్రతి ఒక్కరూ తమ జీవితాలు గడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించామన్నారు. కుల, మతాలకు అతీతంగా మానవులంతా ఒక్కటే అన్న సూత్రాన్ని పాటించాలని సూచించామని, ప్రజలు శాంతియుతంగా జీవితం గడిపినప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవత విలువలు వికసిస్తాయని, దైవభీతి, జవాబుదారీతనం వల్లే మనిషిలో అవసరమైన మానవీయత, నైతికత జనిస్తాయని వివరించారు. తమ సంస్థ మహిళా విభాగం ప్రతినిధులు మహిళలను, వృద్ధాశ్రమం, స్కూళ్లు, సచివాలయాలను సందర్శించి మానవత నైతికత, కరపత్రాలను పంచారని తెలిపారు. కార్యక్రమంలో జేఐహెచ్ సభ్యులు ఎండీ జమీర్, ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, కార్యకర్తలు ఎండీ షఫీ, ఎండీ సిరాజ్, ఎస్‌కే చాంద్, ఎండీ సిరాజ్, ఇబ్రహీం, ఎండీ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర మెటీరియల్ విడుదల



క్యాలెండర్‌ను విడుదల చేసిన డీఈఓ రవిసాగర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి జీవశాస్త్ర మెటీరియల్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ విడుదల చేశారు. నగరంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన వేదికపై ఈ మెటీరియల్‌ను సంఘ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి సాగర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా జీవశాస్త్ర మెటీరియల్ ముద్రించడం అభినందనీయమని, ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కూడా ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఫోరం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఓవీ ధనుంజయ రావు, ప్రధాన కార్యదర్శి జి.గంగాధర రావు, గౌరవ సలహాదారు ఐ.భాస్కర కుమార్, ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): స్త్రీలకు పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదరిశి జి.రాజేశ్వరి సూచించారు. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక తంగెళ్లమూడి యాదవ్ నగర్‌లో ప్రజలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రాజేశ్వరి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం సామాజికంగా అందరికీ సమాన హక్కులు కల్పించారన్నారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఈ ప్రక్రియలో ఏమైనా లోపాలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని కోరారు. ధనిక బడుగు, బలహీన వర్గాల తారతమ్యం లేకుండా అందరికీ ఉచిత విద్యను అందించాలని అన్నారు. కార్యక్రమంలో లీగల ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మరియు సోషల్ వర్కర్ మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రైవేట్ ట్రావెల్స్ కార్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముతికి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రామచంద్రరావు పేట వెంకట్రామ కల్యాణ మండపంలో సోమవారం ది మైత్రి ప్రైవేట్ ట్రావెల్స్ కార్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అసోసియేషన్ గౌరవ సలహాదారు టి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటుచేశారు. అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా బండారు శ్రీను, కార్యదర్శిగా పోలిమెట్ల కరుణాకర్, కోశాధికారిగా పీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా జి.సింహ, గౌరవ సలహాదారుగా బి.బాలాజీ, గౌరవ అధ్యక్షునిగా వి.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని తెలిపారు.

22న జన్మ నక్షత్ర పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 22న స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్వామివారి పూర్వాభాద్రా నక్షత్రం పురస్కరించుకుని చెఱకు రసంతో అభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

హెచ్చరిక

నా క్లయింట్ అయిన శ్రీమతి అంగులూరి లక్ష్మీ పార్వతి భర్త :వెంకటేశ్వరరావు , R/O మాదేపల్లి వారి ఉత్తర్వులను అనుసరించి యావన్మందికి తెలియజేయునది ఏమనగా, అధీకృత అధికారి,కెనరా బ్యాంక్,ఏలూరు శ్రీగజ మహా విద్యాలయ బ్రాంచ్ వారు ది.25-01-2023 తేదీన సాక్షి పేపర్ నందు ప్రసాదపు వీరరాజు, తండ్రి : నాగభూషణం , R/O మాదేపల్లి వారి లోను బాకీ నిమిత్తం మరియు ది.17-02-2023 సాక్షి పేపర్ నందు శ్రీమతి ప్రసాదపు శారద, భర్త: వెంకటేశ్వరరావు, చిరునామా : ఏలూరు, ఆర్.ఆర్.పేట, కెనరా బ్యాంక్ లోన్ బాకీ నిమిత్తం మరియు M/S గీత ఎంటర్‌ప్రైజెస్ లోను బాకీ నిమిత్తం ప్రసాదపు వెంకటేశ్వరరావు, ప్రసాదపు సాయిబాబు, ప్రసాదపు వీరరాజు గార్లకు చెందిన ఆస్తులను వేలం వేయుటకు యిచ్చిన ప్రకటనలు చెల్లవు. సదరు ప్రకటనలలోని షెడ్యూలు ఆస్తులు మా క్లయింటు యొక్క ఉమ్మడి కుటుంబ ఆస్తులు అయి వున్నవి మా క్లయింటుకు 1/4 వంతు అవిభక్తపు హక్కు సదరు ఆస్తులు యందు కలదు. మరియు 2వ అదనపు జిల్లా జడ్జి, ప.గో.జిల్లా,ఏలూరు వారి కోర్టు నందు O.S No:154/2018 . దావా పార్టీషన్ కొరకు పెండింగ్‌లో వున్నది. సదరు కేసులో బ్యాంకు వారు కూడా ప్రతివాదిగా ఉన్నారు. కాని సదరు దావా సంగతులను మరుగున పర్చి ఆస్తుల వేలం కొరకు యిచ్చిన ప్రకటన పూర్తిగా చట్ట విరుద్ధము, మరియు నా క్లయింటు చట్టబద్ధ హక్కులను బైండ్ చేయజాలవు. కావున, యావన్మందికి తెలియజేయునది. ఏమనగా ఎవరైనా బ్యాంకు వారితో షెడ్యూలు ఆస్తులకు సంబంధించి ఏ విధమైన లావాదేవీలు కొనసాగించిన యెడల తీవ్రంగా నష్టపోవుదురని, వారి అందరి మీదా సివిల్,క్రిమినల్ కేసులు తీసుకొనబడునని హెచ్చరించడమైనది.

ఏలూరు,
ది.20-02-2023

సం/-
కండుల శ్రీకృష్ణ దత్తు
న్యాయవాది, ఏలూరు

గృహ సారథులు.. సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

పెదపాడు: గృహ సారథులే పార్టీ రథ వారధులు కావాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. పెదపాడులో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సోమవారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చపత్రికలు, టీడీపీ నాయకుల అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన భాధ్యత వలంటీర్లు, గృహసారథులపై ఉందన్నా రు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులైతే, గృహ సారథులు పార్టీకి, ప్రజలకు సంక్షేమ వారధులన్నారు. మార్చి 18 నుంచి 25 వరకు ఇంటింటికీ గృహ సారథులు వెళ్లి వారికి అందే పథకాలను వివరించాలన్నారు. నియోజకవర్గంలో 114 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, గ్రామసచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్రదుర్గాప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరెక్టరు ముదుగురు సూర్యనారాయణ, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ డైరెక్టరు కత్తుల రవికుమార్ పెదపాడు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారిలు మాట్లాడారు. గృహసారథులు, వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ప్రజలకు ముఖ్యమంత్రి పాలనపై అవగాహన కల్పించాలని, గత పాలకు ప్రస్తుత పాలకు గల వ్యత్యాసాన్ని ఇంటింటీ తెలియజేయాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ, వడ్డి కార్పొరేషన్ డైరెక్టరు ఘంటసాల ప్రభాకరరావు మండల ఉపాధ్యక్షుడు రెడ్డి స్వర్ణకుమారి, అప్పన పద్మావతి, గ్రామ సర్పంచ్‌లు మెడబలిమి స్వరూపరాణి సంతోష్‌కుమార్, సిద్ధాబత్తిన జోజమ్మ, చేపేని రంగారావు, ఏనుగ అబ్రహం, బొడగిరి రామకృష్ణ, మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీలు మరియమ్మ, అప్పలస్వామి, రామసీత పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12-15
బెండకాయలు	40	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	30
కాకర కాయలు	24-28	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	50	అల్లం	70
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	26	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-44	బఠాణీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	54
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	32